పుట : 25-26, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## ఉపాయం

రాఘువయ్యకి నలుగురు జమాజెట్టీల్లాంటి కొడుకులు ఉన్నారు. నలుగురికీ పెళ్ళీ - పేరంటాలు - భార్య బ్రతుకుండగానే కానిచ్చేశాడు. బోల్డంత డబ్బు సంపాదించి, లంకంత కొంప కట్టించాడు. ఆ ఊరికెల్లా మోతుబరీ, పెద్ద బంగళా కట్టించిన ఘనుడూ అయ్యాడు రాఘువయ్య! రాఘువయ్యంటే ఆ ఊరి వారందరికీ గౌరవం, అభిమానం! అతనికి ప్రియమిత్రుడు నరహరి. మాంచి సలహాదారుడు కూడా!

అయితే, వయస్సు పైబడి, రాబడి తగ్గి యింటికి ఎటువంటి సంరక్షణా కల్పించలేకపోతున్నాడు రాఘువయ్య. పిల్లలేమో పెళ్ళాల కొంగుపట్టుకు తిరగటం, తననీ, యింటినీ పట్టించుకోకపోవటం, తాము సంపాదించే సంపాదనను జలాయిగా ఖర్చు చేయటం చూసి, అడిగితే - "యింతోటి మా సంపాదనా మా ఖర్చులకే సరిపోవటం లేదు, యింక నీకూ, ఈ యింటి బాగోగులకూ, రిపేర్లకూ మేమేం ఖర్చుపెట్టగలం!" అంటుంటారు.

కొడుకులూ చెప్పుచేతల్లో లేరు; కోడళ్ళూ చెప్పుతుతల్లో లేరు. మనవలూ, మనవరాళ్ళూ యింక చెప్పనవసరం లేదు; అసలే విన్పించుకోరు. తనకు ఏం కావాలన్నా మందులు కావాలన్నా తానే వెళ్ళి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిరది. "యింకానయం, పూటకింతే తిండి పారేస్తున్నారు వంతులు పోక!" అనుకుంటుంటాడు రాఘువయ్య అస్తమాను మనసులో.

ఒకసారి, "నరహరీ, నాకే విషయంలోనూ బాధగా లేదు; అంతగా పట్టించుకోటమూ లేదు కానీ, ఈ యింటిని నేనూ, నా భార్యా జీవితం అంతే పణంగా పెట్టి, పూర్తి డబ్బు ఖర్చుచేసి, జీవితం నందనవనంలా ఉండాలని యింత పెద్ద యిల్లు కట్టించాం. కానీ, పాపం - నా భార్య అనుభవించకుండానే ఆదిలోనే కన్ను మూసినది. రోజులూ - ఏళ్ళూ గడవగా నా వయసుడిగి, ఈ యిల్లు 'భూత్ బంగళా'లా తయారయింది. కొడుకులూ, కోడళ్ళూ పట్టించుకోటం లేదు - నాకు అదే బాధగా ఉంది. మళ్ళీ ఈ యింటిని సున్నాలతో, రంగులతో, కళకళలాడుతూ అందంగా చూస్తానా - అని ఉందనుకో! ఏ!" అంటూ రాఘువయ్య బాధపడ్డాడు.

నరహరి ఆలోచించి, ఒక 'ఉపాయం' చెప్పాడు రాఘువయ్య. ముందు కొంత సందేహించినా 'అలాగే' అన్నాడు.

ఆ మరునాడు అందర్నీ పిలిచి, 'నేను వృద్ధుడ్ని అయ్యాను. యింకెంత కాలమో ఉండబోను. కాబట్టి ఓ నిర్ణయానికి వచ్చి, మీకు మీమీ వాటాలు వేరువేరుగా యిచ్చి, కాపురాలు వేరువేరుగా పెట్టించేయాలనుకుంటున్నా. ఎవరి వాటాల్లో వారు వుంటూ విడివిడిగా వండుకు తింటూనే - ఇప్పుడే కాదు, నా అనంతరము కూడా - ఇదే యింట్లో కలిసి మెలిసి ఉండండి! ఏమంటారు? అన్నాడు రాఘువయ్య. అది వింటం తడవుగా, "సరే నాన్నా మేమే అలా అందాం అనుకున్నాము కానీ, మీరు బాధపడతారని ఊరుకున్నాం" అంటూ ఒక్కొక్కరే కొడుకు - కోడళ్ళూ వచ్చి, కాళ్ళకు నమస్కారం చేసి నవ్వుకుంటూ, సంతోషంగా ఎవరి గదుల్లోకి వారు వెళ్ళిపోయారు. 'అమ్మయ్య' అని మనసులో రాఘువయ్య నవుకున్నాడు.

ఎవరి వాటాల్లో వారు కాపురాలు మొదలుపెట్టారు. అతి త్వరలోనే యింటిపై, వాటాపై, మోజు పుట్టి రంగులు వేయించుకుని, హంగులు చూపించుకున్నారు. ఒక్కొరొక్కరే యింటి వేయించిన రంగులు పూర్తయి, అందంగా తయారయింది బంగళా! రాఘువయ్యని యింకా అభిమానంగా చూసుకోసాగారు - కొడుకులూ, కోడళ్ళూ! తమ మనసులోని మాట నెరవేర్చాడని వారనుకున్నారు. తన కోరిక ఈ విధంగా తీరిందని 'నాది' అనే సరికి ప్రతివారికీ ఎంత స్వార్థం, ఎంతో తపన ఏర్పడుతుందో రాఘువయ్య చూడగలిగాడు.